క్లుప్తంగా

అమరవీరుల త్యాగాల ఫలితం స్వేచ్ఛ, సమానత్వం

వేంపల్లె : అమరవీరుల త్యాగాల ఫలితమే స్వేచ్ఛ, సమానత్వాలు లభించాయని కళాశాల వైస్‌ ప్రిన్సిపాల్‌ నాగేంద్ర తెలిపారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్స్‌ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్‌ ఆర్మీ కెప్టెన్‌ మనోహర్‌ మాట్లాడుతూ మన దేశ పౌరుల స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం కొరకు అనేకమంది మహనీయులు తమ జీవితాలను బలిదానం చేశారన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్స్‌ డాక్టర్‌ ఓబుల్‌రెడ్డి, డాక్టర్‌ మల్లేశ్వరమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప ఉక్కు భిక్ష కాదు హక్కు

ముద్దనూరు : కడప ఉక్కు పరిశ్రమ ఎవరి భిక్ష కాదు అని అది ఆంధ్రుల హక్కు అని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్‌ తెలిపారు. గురువారం సీపీఎం ఉక్కు జీపు జాతా కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అనాదిగా రాయలసీమకు అన్యాయం జరుగుతోందని, ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అన్ని వనరులు వున్నప్పటికీ ప్రభుత్వాలు నిర్లక్ష్యం ధోరణితో వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల రూరల్‌ : గీత కులాలు 10 శాతం రాయితీతో మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవచ్చునని ఎక్సైజ్‌ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక ఎక్సైజ్‌ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైఎస్సార్‌ జిల్లాకు 14 మద్యం షాపులు మంజూరయ్యాయని, మూడు షాపులు పులివెందుల టౌన్‌, వేముల, చక్రాయపేటకు మండలాలకు మంజూరయ్యాయన్నారు. గౌడ, ఈడిగ కులాలకు చెందిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తులకు ఫిబ్రవరి 5 చివరి తేదీ అన్నారు. 7వ తేదీన కలెక్టర్‌ ఆధ్వర్యంలో లక్కీ డిప్‌ ద్వారా అర్హులైన వారికి మద్యం షాపులు కేటాయిస్తారన్నారు.

రాష్ట్రస్థాయిలో లయోలా విద్యార్థిని ప్రతిభ

పులివెందుల టౌన్‌ : రాష్ట్రస్థాయి పరుగు పందెంలో లయోలా పాల్‌టెక్నిక్‌ కళాశాల విద్యార్థిని ప్రతిభ చూపిందని ప్రిన్సిపాల్‌ ఫాదర్‌ బ్రిట్టో, కరస్పాండెంట్‌ ఆంటోని స్వాములు తెలిపారు. గురువారం పట్టణంలోని లయోలా పాల్‌టెక్నిక్‌ కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఈనెల 28, 29, 30వ తేదీలలో విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలో హరిణి ప్రతిభ చూపి గోల్డ్‌ మెడల్‌ సాధించిండంతో హర్షం వ్యక్తం చేశారు. త్వరలో జరిగే సౌత్‌ఇండియా పోటీలలో కూడా రాణించాలని వారు ఆకాంక్షించారు.

మద్యం సీసాలు స్వాధీనం

ముద్దనూరు : అక్రమంగా తరలిస్తున్న 8 మద్యం సీసాలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ప్రసాద్‌ అనే వ్యక్తి నుంచి 8 క్వార్టర్‌ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్‌ తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

జమ్మలమడుగు : మండలంలోని బీసీ, ఈబీసీ, బలిజ కాపులకు 50 శాతం సబ్సిడీతో బ్యాంకు నుంచి రుణాలు పొందుటకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ సయ్యదున్నిసా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీ లోపు 60 సంవత్సరాలు లోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ–ఏ వర్గానికి 8, బీసీ–బీకి 10, బీసీ–డీ 7, బీసీ–ఈ 6 మొత్తం 31 రుణాలను చంద్రన్న స్వయం ఉపాధి కింద 50 శాతం సబ్సిడీతో ఇస్తారన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థుల సమస్యలపై ఉద్యమిస్తాం

ఎర్రగుంట్ల : జిల్లాలో విద్యార్థుల సమస్యలపై ఉద్యమించడానికి అఖిల భారత యువజన సమాఖ్య ముందంజలో ఉంటుందని ఏఐవైఎఫ్‌ జిల్లా కార్యదర్శి శరత్‌కుమార్‌ తెలిపారు. గురువారం స్థానిక ఏఐవైఎఫ్‌ కార్యాలయంలో ఆయన విలేఖర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల భర్తీకి, కడప ఉక్కు పరిశ్రమ సాధనకోసం పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇస్తామని ఇంత వరకు కార్యచరణ కాలేదన్నారు. అలాగే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ ఇంత వరకు అమలు చేయలేదన్నారు.

దోమల నివారణతో వ్యాధులు దరిచేరవు

పులివెందుల రూరల్‌ : దోమలను నివారించుకోవడంవల్ల వ్యాధులు దరిచేరవని మలేరియా సబ్‌ యూనిట్‌ ఆఫీసర్‌ సిద్ధయ్య తెలిపారు. గురువారం పట్టణంలోని సాంఘి సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ఫైలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధివల్ల రాత్రివేళల్లో ఎక్కువగా జ్వరం, చలి, వణుకు, శరీర భాగాలలో స్వల్ప వాపు, ఒళ్లంతా నొప్పు లు తదితర లక్షణాలు ఉంటాయన్నారు.కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ శాఖాధికారి లక్ష్మీ శైలజ పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలేక మిరప రైతులు కుదేలు


సాగులో ఉన్న మిరప పంట


తెగుళ్ల దెబ్బతిన్న మిరప కాయలు

పులివెందుల రూరల్‌ : నియోజకవర్గంలో సుమారు వేలాది ఎకరాల్లో రైతులు మిరప పంటను సాగు చేశారు. ఆరుగాలం కష్టించి మిరప పంట సాగు చేస్తే గిట్టుబాటు ధర రావడంలేదని రైతులు సతమతమవుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మండలంలో మిరప పంట సాగు పెరిగింది. మిరపకాయల ధరలు బాగా ఉన్నాయన్న ఆశతో రైతులు మిరప పంటను సాగు చేశారు. ఇక్కడ పండించిన పచ్చి మిరప కాయలను రైతులు వ్యాపారస్తులకు, వ్యాపారస్తులు హైదరాబాద్‌, విజయవాడ, కలకత్తా, నాగపూర్‌ వంటి ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.20 లకే ధర పలుకుతున్నాయని రైతులు కుదేలవుతున్నారు. ఎకరా మిరప పంట సాగుకు సుమారు రూ.15 వేలకుపైగా పెట్టుబడులు పెట్టడం జరిగిందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు అనేక కొత్త రకాల తెగుళ్లు వ్యాపించడంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి మందులు పిచికారి చేయాల్సి వస్తోందని అంటున్నారు. పంట విక్రయించగా వచ్చిన డబ్బులు కూలీలకు, పురుగుల మందులకే సరిపోతుందని, పెట్టిన పెట్టుబడులు కూడా రావడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప కాయల బస్తా రూ.1000ల నుంచి రూ.1200లు పలుకుతోంది. అదే బస్తా రూ.1800ల నుంచి రూ.2200ల ధర ఉంటే రైతులకు గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు.

వ్యాపారస్తుల సిండికేట్‌..

మిరప పంటలో దిగుబడి బాగున్నా ధరలు మాత్రం అంతంత మాత్రమే ఉన్నాయి. అందుకు వ్యాపారస్తులు సిండికేట్‌ అవ్వడమే కారణమని రైతులు అంటున్నారు. వ్యాపారస్తులంతా కలిసి మిర్చి ధరను ఒక్కసారిగా తగ్గించేశారని వారు ఆవేదన చెందుతున్నారు.

గత ఏడాది మిరప పంట సాగు చేస్తున్న రైతులకు పెట్టుబడులు కూడా రాక అప్పులపాలయ్యారు. ప్రస్తుతం దిగుబడులు కొంతవరకు బాగున్నప్పటికి ధరలు లేకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పురుగుల మందులు పిచికారు చేసిన ప్రయోజనం లేదు



మిరప పంటలకు తెగుళ్లు వ్యాపించడంతో పురుగుల మందులు పిచికారి చేసినా ఎలాంటి ప్రయోజనంలేదు. పురుగు మందుల కోసమే వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం కూలీల రేట్లు పెరిగిపోవడంతోపాటు వ్యాపారస్తులందరూ ఏకమై రైతులను మోసం చేస్తున్నారు. కనీసం మిరప కాయల బస్తాకు రూ.2వేల నుంచి రూ.2500లు ఉంటే రైతుకు గిట్టుబాటు అవుతుంది.
– నాగేంద్ర, మిరప రైతు, పులివెందుల

తెగుళ్లతోపాటు కూలీల ఖర్చు పెరుగుతోంది



ప్రస్తుతం మిరప పంటకు తెగుళ్లు సోకడంతో పాటు పంట కోతకు కూలీల ఖర్చు పెరుగుతోంది. మిరప పంట ఏపుగా పెరిగినా తెగుళ్లు సోకడంతో మిరప కాయలను కొనుగోలు చేసేవారే లేరు. మిరప కాయల బస్తా కోస్తే కూలీలకే రోజుకు రూ.400ల నుంచి రూ.500లు ఇవ్వాల్సి వస్తుంది. దీంతో మిరప పంట సాగు చేసిన రైతులకు లాభాలు మాత్రం రావడంలేదు.
– వెంకటదాస్‌,మిరప రైతు, పులివెందుల

చిత్రావతికి నీళ్లు తెప్పించిన ఘనత వైఎస్‌ అవినాష్‌రెడ్డిదే


విలేకరులతో మాట్లాడుతున్న లింగాల మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్‌ : బీటెక్‌ రవి నువ్వు పులివెందుల అసెంబ్లీ రాజకీయాలకు కొత్త కావచ్చు మా నాయకుడు ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి ఎంపీ కాకమునుపే పులివెందుల నుంచి అనంతపురం కలెక్టరేట్‌ వరకు పాదయాత్ర చేసి తుంగభద్ర నుంచి చిత్రావతికి నీళ్లు తెప్పించాడని లింగాల వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తెలిపారు. గురువారం భాకరాపురంలోని వైఎస్‌ జగన్‌ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చిత్రావతిలోనే 10 టీఎంసీల నీరు నిల్వ ఉంచి 365 రోజులు రైతులకు నీరు అందించాడన్నారు. 2014 మీ ప్రభుత్వం హయాంలో పూర్తి చేయలేని పైపులైన్‌ పనులను తన సొంతనిధులతో దాదాపు రూ.2 కోట్లు ఖర్చు పెట్టి తాతిరెడ్డిపల్లె, కోమన్నూతల, ఎగువపల్లె, దిగువపల్లె, మురారిచింతల, లోపట్నూతల గ్రామాల రైతులకు పైపులైన్లు వేసి సాగునీరు అందించాడు. అరటి రైతులకు 2016–17 సమయంలోనే టన్నుకు రూ.20 వేల పైచిలుకు ధర లభించిందన్నారు. అరటి రైతుల కోసం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లు వెచ్చించి 95 శాతం పనులు చేసి శీతల గిడ్డంగి నిర్మిస్తే ఇంకో 5 శాతం పనులు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురాలేని నువ్వు రైతుల గురించి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. కమిషన్లు వచ్చే మాట వాస్తవం అయితే, ఈ రోజు అరటికి ఉన్న రేటును అలాగే కొనసాగించి కమిషన్లు తీసుకోలేదని నిరూపించు. వచ్చే నాలుగేళ్ల కాలంలో అరటి రేటు తగ్గితే అప్పుడు నువ్వు కమిషన్‌ తీసుకున్నట్లేనన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించగలవా. పులివెందుల నియోజకవర్గంలో చీని ధరల రేటుపై ఉన్న దళారుల సూట్‌ కూడా లేకుండా చేసి మార్కెట్‌ యార్డ్‌ నిర్మించి రైతులే స్వయంగా మార్కెటింగ్‌ చేసుకునేలా చేసిన ఘనత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డిలకే దక్కుతుందన్నారు. నీకు జూదం, కోడి పందేలు, మట్కా దోపిడీలపైన ఉన్న అవగాహన రైతుల పక్షాన పోరాడటంపైన ఉండదన్న మాట అక్షర సత్యమన్నారు. సమావేశంలో లింగాల మండల కన్వీనర్‌ బాబురెడ్డి, వెలిదండ్ల సర్పంచ్‌ మల్లికార్జునరెడ్డి, చిన్నకుడాల సర్పంచ్‌ నాగేంద్రనాథ్‌రెడ్డి, మాజీ సింగిల్‌ విండో మల్లికేశవరెడ్డి, రామట్లపల్లి జగన్‌మోహన్‌రెడ్డి, పెద్దకుడాల కృష్ణారెడ్డి, ఇంటేపల్లె మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల యూత్‌ నాయకుడు మనోహర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

అడ్రస్‌ లేని లేబర్‌ ఆఫీస్‌

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీలో లేబర్‌ ఆఫీస్‌ ఎక్కడుందో ఎవరికి తెలియడం లేదని మదర్‌ థెరిసా సేవా సమితి ఛారిటబుల్‌ ట్రస్ట్‌ అధ్యక్షుడు జూటూరు విజయ్‌కుమార్‌ తెలిపారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కమలాపురంలో లేబర్‌ ఆఫీస్‌ చిరునామా గల్లంతైందని, అసలు ఆ ఆఫీసు ఎక్కడుందో ప్రజలకు తెలియడంలేదని ఎద్దేవా చేశారు. అక్కడు సందుల్లో గొందులో లేబర్‌ ఆఫీస్‌ ఏర్పాటు చేసి ప్రజలకు కనిపించకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రకాల లేబర్‌ పనులు చేసే వారికి అండగా ఉండి ప్రభుత్వం నుంచి వారికి వచ్చే పథకాలను చేరవేయాల్సిన కార్యాలయం ప్రజలకు కనిపించకుండా ఉందంటే చాలా దారుణం అన్నారు. కనీసం ఒక బోర్డు కూడా ఏర్పాటు చేయని స్థితిలో లేబర్‌ కార్యాలయం ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ ఆఫీస్‌ పై ప్రత్యేక శ్రద్ధ చూపి, కూలీలకు, కార్మికులకు సేవలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి రమేష్‌ మాట్లాడుతూ గతంలో గ్రామ చావడి వద్ద లేబర్‌ ఆఫీస్‌ ఉన్నప్పుడు తాను చాలా మంది కార్మికులకు కార్డులు అందించానని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ కార్యాలయం అడ్రస్‌ గల్లంతు కావడం బాధగా ఉందన్నారు. మన ఊరు సేవా సమితి అధ్యక్షుడు శీలం శ్రీనివాసులు మాట్లాడుతూ శిబిరం ఏర్పాటు చేసి కార్మికులకు, కూలీలకు లేబర్‌ కార్డులు జారీ చేయాలన్నారు.

కడప ఉక్కు నినాదంతో పోరాటం చేద్దాం

జమ్మలమడుగు : కడప ఉక్కు పరిశ్రమ రాయలసీమ హక్కు అనే నినాదంతో పోరాటం చేద్దామని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్‌ తెలిపారు. గురువారం జీపు జాత సందర్భంగా పాత బస్టాండ్‌లోని ఎద్దుల ఈశ్వరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఎం రాష్ట్ర మహాసభలు ఫిబ్రవరి మొదటి మూడు రోజుల్లో నెల్లూరులో జరుగుతుండటంతో ఈ మహాసభల్లో స్టీల్‌ప్లాంట్‌ లక్ష్యసాధనే లక్ష్యంగా అజెండాతో ముందుకు పోతున్న సందర్భంగా సున్నపురాళ్లపల్లెలోని స్టీల్‌ప్లాంట్‌ శంఖుస్థాపన వద్ద నుంచి జీపు జాతను ప్రారంభించారు. అనంతరం జమ్మలమడుగు పాతబస్టాండ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు కడప స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా మరచిపోయారన్నారు. అనంతరం రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామన్న, చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ బ్రహ్మిణి ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం సాధ్యమైనప్పుడు సెయిల్‌కు ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. ఎన్‌డీఏ కూటమి రాష్ట్రంలో అధికారంలోనికి వచ్చి ఏడునెలలు దాటిన ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో

వేంపల్లె : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తీర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌ డిమాండ్‌ చేశారు. కడప ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో నిర్వహించిన జీపు జాత గురువారం వేంపల్లెకు చేరుకుంది. ఈ నేపథ్యంలో వేంపల్లెలోని నాలుగు రోడ్ల కూడలిలో సీపీఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ టీడీపీ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఉక్కు పరిశ్రమను కడప జిల్లాలో ఏర్పాటు చేయాలన్నారు. ఉక్కు కర్మాగారం కోసం ప్రజాప్రతినిధులు తమ పదవులకు రాజీనామాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యవర్గ సభ్యుడు అన్వేష్‌, సీపీఎం సభ్యుడు భైరవ ప్రసాద్‌, సీపీఎం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శనగ పంటలో పంటకోత ప్రయోగం

సింహాద్రిపురం : సింహాద్రిపురం, కసనూరు, పైడిపాలెం, సుంకేసుల గ్రామాల్లో గురువారం శనగ పంటలో ఏఓ శివమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బంది పంట కోత ప్రయోగాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఓ పంట కోత ప్రయోగం ద్వారా ప్రయోగాత్మకంగా కాకపోయినా దిగుబడి వస్తుందన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఓకు విన్నవించారు.

పాస్టర్ల అభిషేక మహోత్సవం

కమలాపురం : స్థానిక టీసీసీ టౌన్‌ చర్చిలో పాస్టర్ల అభిషేక మహోత్సవం వేడుకలా నిర్వహించారు. గురువారం చర్చి జనరల్‌ సెక్రటరీ రవీంద్రప్రసాద్‌ అధ్యక్షతన సీనియర్‌ పాస్టర్లు, కౌన్సిల్‌ అధ్యక్షుడు దేగల జాన్‌ ఆధ్వర్యంలో అభిషేక మహోత్సవం నిర్వహించారు. టీసీసీ టౌన్‌ చర్చి ఫాస్టర్లుగా మహిమదేవి, ప్రసాద్‌బాబులను ఎంపిక చేసి అభిషేక మహోత్సవం నిర్వహించారు. అనంతరం కొంత మంది పాస్టర్లను బదిలీ చేయడంతో పాటు మరి కొంత మందిని డివిజనల్‌ చైర్మన్లుగా పదోన్నతులు కల్పించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలనుంచి సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

ఫైలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన

వేముల : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేల్పులలో ఫైలేరియా వ్యాధిపై గురువారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌ యూనిట్‌ ఆఫీసర్‌ సిద్దయ్య మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి అనేది పరాన్నజీవుల వల్ల కలిగే అంటు వ్యాధి అన్నారు. ముఖ్యంగా ఫైలేరియా క్రిముల ద్వారా వస్తుందన్నారు. వీటి సంక్రమణకు క్యూలెక్స్‌ దోమవల్ల వస్తుందని, దోమల ఫైలేరియా లార్వాల ద్వారా సోకుతుందన్నారు. దీనివల్ల శరీరంపై వాపులు రావడం, శారీరక బాధలు ఉంటాయన్నారు. ఫైలేరియా వ్యాధి లక్షణాలల్లో రాత్రివేళల్లో ఎక్కువగా జ్వరం, చలి, వణుకు, శరీర భాగాలలో వాపు, ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలు ఉంటాయన్నారు. సకాలంలో ఈ వ్యాధికి చికిత్స తీసుకోకపోతే నడవడం కూడా కష్టమవుతుందన్నారు.

వీటి నివారణకు శుభ్రత పరిశుభ్రత పాటించడం, డీఈసీ మాత్రలు తీసుకోవడం, నీటి నిల్వ లేకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వీణా కుమారి, ఆరోగ్య కార్యకర్త నాగేశ్వరి, ఆశా కార్యకర్తలు శాంతి, లక్ష్మీదేవమ్మలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

కమలాపురం : స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన జాబ్‌ మేళాకు 55 మంది యువతీ యువకులు హాజరయ్యారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ–సీడప్‌, డిస్ట్రిక్‌ ఎంప్లాయిమెంట్‌ ఎక్స్చేంజ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌ మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 55 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇందులో నవత రోడ్‌ ట్రాన్స్‌పోర్ట్స్‌కు 10 మంది, ఎల్‌ఐసీ ఆఫ్‌ ఇండియాకు 17 మంది మొత్తం 27 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం గంగాధర్‌ మాట్లాడుతూ ప్రతి నెలా వెలుగు కార్యాలయంలో జాబ్‌ ఫెయిర్‌ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి నెల జరిగే జాబ్‌ మేళాను మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించు కోవాలన్నారు.

వీధికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

జమ్మలమడుగు రూరల్‌ (మైలవరం) : వీధి కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన మైలవరం మండలంలో జరిగింది. స్థానికులు ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామంలోని మార్కెట్‌ వీధికి చెందిన అయూబ్‌ అనే 4 సంవత్సరాల బాలుడు ఇంటి బయట ఆడుకుంటుండగా వీధి కుక్క ఒక్కసారిగా బాలుడి చేయిని పట్టుకుని కొరికింది. దీంతో బాలుడికి తీవ్ర గాయమైంది. బాలుడి కేకలు విని స్థానికులు, కుటుంబ సభ్యులు వచ్చి తరిమివేయడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కుక్కల బెడద చాలా ఉందని గతంలో కూడ పలువురిపై దాడి చేశాయని తెలిపారు. వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

వైభవంగా గ్రామోత్సవం

వీరపునాయునిపల్లె : మండలంలోని కీర్తిపల్లెలో నల్లమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్రాలకు వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో రూ.12,800 నగదు అందింది. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఒంగోలు జాతికి చెందిన వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఆర్‌ఎంపీ ప్రథమ చికిత్స కేంద్రాల తనిఖీ

ఎర్రగుంట్ల : పట్టణంలో ఆర్‌ఎంపీలుగా అర్హత ఉండి ఆసుపత్రులు పేరుతో నడుపుతున్న కేంద్రాలలో కేవలం ప్రథమ చికిత్సకు సంబంధించి వైద్యం చేయాలని అలా కాదని నిబంధనలు అతిక్రమించి వైద్యం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న కేంద్రాలను ఆయన అకస్మికంగా తనిఖీ నిర్వహించి మాట్లాడారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి

పులివెందుల టౌన్‌ : కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని ప్రజలందరూ ముందుకు తీసుకెళ్లి పోరాటాలు చేయాలని, జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు రామన్న తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక పూలంగళ్ల సర్కిల్‌ వద్ద సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అన్వేష్‌ అధ్యక్షతన జీపు జాత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ అతిథులుగా సీపీఎం రాష్ట్ర నాయకులు రామన్న, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చాంద్‌బాషాలు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ ఐదు ప్రాంతాల్లో తలపెట్టిన జీపు జాతలలో భాగంగా కడప జిల్లాలో ఉక్కుపరిశ్రమను ఏర్పాటు చేయాలని సీపీఎం కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జమ్మలమడుగులో ప్రారంభమైన జీపు జాత పులివెందులకు రావడం జరిగిందన్నారు. వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ జిల్లాల్లోని ఒక్కటైన కడప జిల్లాలో భారీ ఉక్కు పరిశ్రమ నిర్మించడానికి పుష్కలంగా అందుబాటులో ఉన్నాయన్నారు. పాలకులు ఉక్కు ఫ్యాక్టరీని కడప జిల్లాలో ఏర్పాటు చేయడానికి నిరాకరించడం దారుణమని, జమ్మలమడుగు ప్రాంతంలో నిర్మించిన ఉక్కు ఫ్యాక్టరీకి పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాయకులు శంకుస్థాపనలు చేస్తున్నారే తప్ప కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించడానికి పూర్తి సహకరించలేకపోవడం దారుణమన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3వ తేదీలలో జరిగే రాష్ట్ర 27వ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌, సీపీఎం జిల్లా నాయకులు రాజమణి, భైరవ ప్రసాద్‌, రమణ, తులసి, సీపీఎం ఏరియా కార్యదర్శి గపూర్‌, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డుపడుతున్న కూటమి ప్రభుత్వం


మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్‌ : పులివెందులలో అడుగడుగునా అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్నది కూటమి ప్రభుత్వం నాయకులదేనని మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌, వైస్‌ చైర్మన్‌ హాఫీజ్‌ లు అన్నారు. గురువారం భాకరాపురంలోని వైఎస్‌ జగన్‌ క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు 90% పూర్తయ్యాయన్నారు. మిగిలిన 10 శాతం పనులు 8 నెలలు గడిచినా మీ ప్రభుత్వంలో మీరు ఒరగబెట్టిందేమిటని వారు ప్రశ్నించారు. పులివెందుల మున్సిపాలిటీని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేశారన్నారు. ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి కావాలంటే రూ.150 కోట్ల నిధులు మున్సిపాలిటీకి అవసరమన్నారు. ఆ నిధులను టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తే సౌత్‌ఇండియాలో ఎక్కడా లేని విధంగా నెంబర్‌ వన్‌ మున్సిపాలిటీగా పులివెందుల మున్సిపాలిటీ ఉంటుందన్నారు. మిగిలిన పనులను రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారంటే ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. ఎక్కడ అవినీతికి తావు లేకుండా రైతులకు మేలు చేయడం జరిగిందన్నారు. సింహాద్రిపురం మండలంలో జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల 90 శాతం గత ప్రభుత్వంలో పనులు పూర్తయితే ఈ ప్రభుత్వంలో 10 శాతం పనులు పూర్తి చేసేందుకు 8 నెలలు పట్టిందన్నారు. ఈ ఎనిమిది నెలల కూటమి ప్రభుత్వంలో పులివెందుల నియోజకవర్గంలో మీరు అభివృద్ధి చేసింది ఏమిటో చెప్పాలని వారి ప్రశ్నించారు. మున్సిపాలిటీ జనరల్‌ ఫండ్‌ నిధులతో బోర్లు వేస్తే అవి మీ సొంత డబ్బులు పెట్టి వేయించుకున్నట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మీకు చేతనైతే నిధులు తెప్పించి పులివెందులను బెస్ట్‌ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌ యార్డు చైర్మన్‌ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్‌ గంగాధర్‌ రెడ్డి, జేసీఎస్‌ ఇంచార్జ్‌ పార్నపల్లి కిశోర్‌, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్‌ సెక్రటరీ కోళ్ల భాస్కర్‌, వైఎస్సార్‌సీపీ నాకులు రసూల్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్‌ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్‌ మెడికల్‌ సెంటర్‌(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్‌ సోరియాసిస్‌, తామర, గజ్జి, ఫంగస్‌ ఇన్ఫెక్షన్‌, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పేదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట,ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్‌ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్‌, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్‌ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్‌ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్‌ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్‌ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్‌ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు


సంగీత కచేరిలో గాత్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు

వేంపల్లె : స్థానిక ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపు ల్‌ ఐటీలో త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవా లు వైభవంగా జరిగినట్లు డైరెక్టర్‌ ఏవీఎస్‌ కుమారస్వామి గుప్త తెలిపారు. గురువారం లలిత కళల వి భాగాధిపతి మొహిద్దీన్‌ఖాన్‌ ఆధ్వర్యంలో గాత్ర విభాగ విద్యార్థులు త్యాగరాజస్వామి వారి పంచర త్న కృతులను దివ్య నామ సంకీర్తనలను ప్రదర్శించి అందరిని మంత్ర ముగ్ధులను చేశారు. గాత్ర ఉ పాధ్యాయులు ఎం.జ్యోతీశ్వరన్‌, శ్రీలక్ష్మీ తమ వి ద్యార్థి బృందంతో కలిసి సంగీత కచేరి చేయగా వయోలిన్‌పై దేవానంద, మృదంగంపై హరికృష్ణ వాయిద్య సహకారంతో అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం సాంస్కృతిక కళల విశిష్టతను ఆధునిక సమాజంలో వాటి అవసరాన్ని గురించి విద్యార్థులందరికీ డైరెక్టర్‌ సందేశాన్ని అందించారు. ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ ఐటీలో చదువుతోపాటు లలిత కళలు, సంగీతం, నృత్యాల పోటీలలో విద్యార్థులు త మ ప్రతిభను కనబరచడం చాలా ఆనందంగా ఉందన్నారు. సందర్భంగా డైరెక్టర్‌ కుమారస్వామి గుప్తాను సత్కరించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవికుమార్‌, సీఎంఓ అనిల్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

గాంధీజీ అడుగు జాడల్లో పయనించాలి


గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌

పులివెందుల టౌన్‌ : ప్రతి ఒక్కరూ జాతిపిత మహాత్మ గాంధీజీ అడుగు జాడలలో పయనించాలని మున్సిపల్‌ చైర్మన్‌ వరప్రసాద్‌, వైస్‌ చైర్మన్‌ హాఫీజ్‌లు తెలిపారు. గురువారం జాతిపిత మహాత్మ గాంధీజీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్‌ యార్డు మాజీ చైర్మన్‌ చిన్నప్ప, జేసీఎస్‌ ఇన్‌ఛార్జి పార్నపల్లె కిశోర్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు హాలు గంగాధరరెడ్డి, రసూల్‌, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఆర్య వైశ్య సంఘం, ఆవోపా, వాసవీ క్లబ్‌ ఆధ్వర్యంలో ముద్దనూరు రోడ్డులో ఉన్న గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

ఎర్రగుంట్ల : మహాత్మ గాంధీ కుష్టురోగుల పట్ల మానవతా దృక్పథంతో చూసుకునే వారని వారి ఆశాయలకు అనుగుణంగా పీహెచ్‌సీ సిబ్బంది పని చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి జోత్స్న తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శ్రీ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాలర్పించారు. కార్యక్రమంలో డీపీఎంఓ వీరభద్రయ్య, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు ఓబులేసు, లక్ష్మీదేవమ్మ, ఎంపీహెచ్‌ఓ రవిశంకర్‌రాజులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమ రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దచెప్పలి పశు వైద్యాధికారిణి శివజ్యోతి తెలిపారు. గురువారం మండలంలోని నసంతపురంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి వచ్చిన పశువులకు వైద్యసేవలు అందజేశారు. ఈ శిబిరాలలో ఉచితంగా వైద్యం అందించడంతో పాటు తేలికపాటి శస్త్ర చికిత్సలు, ఎదకు రాని, చూలు కట్టని పశువుల గర్భకోశ వ్యాధులకు పరీక్షలు, పశువులు, దూడలు, సన్న జీవాలకు నట్టల నివారణ మందు అందిస్తామన్నారు. నసంతపురంలో 69 సాధారణ చికిత్సలు, 11 గర్భకోశ చికిత్సలు, 16 చూడి నిర్ధారణ పరీక్షలు, 27 గేదెలకు, 31 లేగ దూడలకు, 393 జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్‌ ప్రాంతాన్ని అభివృద్ధి పరచాలి

జమ్మలమడుగు : మైలవరం మండలం నార్జాంపల్లి రహదారిలో టెక్స్‌టైల్‌ పార్కులో హ్యాండ్‌లూం, పవర్‌ లూం, డయింగ్‌ ప్లాంట్‌లను ఏర్పాటు చేయడం కోసం ముందుకు వచ్చిన చేనేతలకు స్థలం పంపిణీ కార్యక్రమాన్ని హ్యాండ్‌లూం ఏడీ పిచ్చేశ్వరరావు అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి 93 మందికి పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం టెక్స్‌టైల్‌ పార్కు ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు.